వ్యాస కౌముది

# ప్రపంచ ఆధునిక కథా పిత
# హెన్రి ఆల్బెర్ట్ రినే గి ద మొపాసా
## [Henri Albert Rene Guy de Maupassant]

నవులూరి వెంకటేశ్వర రావు

ప్రపంచ ఆధునిక కథకు పితామహులుగా భావించబడే ఇద్దరు ముగ్గురు రచయితలలో ఫ్రాన్స్ కు చెందిన గి ద మొపాసా ఒకడు. జీవించి ఉంటె ఆగస్టు 5న 172 ఏళ్ళ వయసు వాడయ్యే వాడు. 130 ఏళ్ల క్రితం ఘోర మరణం పాలయ్యాడు; వీలునామా అక్కరలేని, తన వయోరహిత రచనను ప్రపంచానికి ఒదిలి. ఈ ఆస్తి విలువ కట్టగల నిపుణుడు లేడు. అతని జీవితం కూడా ఒక విషాదాంత గాథ. "నేను ఉల్కలా సాహిత్య జీవితంలోకి అడుగు పెట్టాను; దీని నుంచీ పిడుగులా నిష్క్రమిస్తాను," అన్నాడు. అతని రచనా వ్యాసాంగ జీవితం ఉల్కలా చిన్నది – ఒక దశాబ్ద కాలం మేర. ఉల్కలానో, పిడుగులానో అంతరించి పోకుండా అతను సాహిత్య వినువీధిలో మెరిసే తారగా మిగిలి పోయాడు. అతను సృష్టించిన సాహిత్యం గురించే గాక, దానికి అనుసంధానంగా గ్రీకువిషాదాంత గాథ లాంటి అతని జీవిత గాథనూ మననం చేసుకోవాలి.

ఫ్రాన్స్ దేశపు నార్మండి ప్రాంతంలో ఉండే డైయఫ్ అనే చేపల రేవు పట్నంలో 5 ఆగస్టు1850లో పుట్టాడు. అతని తల్లి దండ్రుల పేర్లు లా లీ పోయిట్టెవిన్, గుస్తావ్ ద మొపాసా. అతను స్త్రీ లోలుడు; భార్యాభర్త ఎప్పుడూ కలహించుకునే వాళ్ళు. రచయితకు 11 ఏళ్ళు, అతని తమ్ముడికి 5 ఏళ్ళు ఉన్నపుడు అతని తల్లి తండ్రికి విడాకులివ్వగా పిల్లలిద్దరూ తల్లి సంరక్షణలో అందమైన సముద్ర తీర పట్నం ఎట్రాటట్ లో పెరిగారు. ఆమె గ్రంథ పఠనం చేయడమే కాక కొడుకు చేతా పుస్తకాలు చదివించేది. ఆమె కొడుకును మత సంబంధమైన బడిలో [సెమినరీ] అతని 13వ ఏట వేసింది.

మొపాసా 14 సంవత్సరాల వయసులో వున్నపుడు ఒక నిలువ ఉంచబడిన [mummified] చేతిని చూపించాడు ఆంగ్ల కవి ఆల్గెర్నాన్ చార్ల్స్ స్విన్బర్న్ [Algernon Charles Swinburne]. చిన్న వయసులో భయంగొలిపే ఎండిన శరీరాంగం మనోచిత్రం గీసి, అతన్ని ప్రభావావితం చేసి 1875లో ''తెగిన చేయి'' [La Main Ecorchee] అనే ఒక కథను రాయించింది. ఆ రోజులలోనే నీటిలో మునిగి పోతున్న ఆ ఆంగ్ల కవిని ఇద్దరు నావికులతో కలిసి రక్షించాడు. మరుసటి రోజు ఆ కవి మొపాసాను ఇంటికి పిలిచి కోతి మాంసంతో విందు చేసాడు; మాంసం ఏ జీవిదో మొపాసాకు తెలియదు.

18వ ఏడుకల్లా అతనికి సెమినరీ జీవితం మొహం మొత్తి మత వ్యతిరేక, సామాజిక, స్త్రీ సంబంధమైన విషయాల లోకి తల దూర్చాడు. కావాలని ఒక నాటకమాడి వాళ్ళే తనను అందులోనుంచి బహిష్కరించేట్టు చేసుకున్నాడు. తరువాత కొన్నాళ్ళకు రూయియిన్ నగరంలోని బడిలో[Rouen Lycee] చదువుతున్నపుడు కవిత్వం వ్రాయడం మొదలు పెట్టాడు.1869లో న్యాయ విద్య అభ్యసించడం మొదలుపెట్టాడు. ఫ్రాన్స్ ప్రష్యన్యుద్ధం అడ్డుపడింది. యుద్ధంలో పనిచేశాడు.1871లో తిరిగి చదువు మొదలుపెట్టాడు. తరువాత గుమస్తాగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 1872 –1880 మధ్యలో పనిచేశాడు ఆ పనంటే ద్వేషిస్తూనే. ఆ చాలీ చాలని జీతపు గుమాస్తా జీవితం అతన్ని బాధించింది. నౌక బానిస జీవితాన్ని గడప వలసి వచ్చింది అనుకునేవాడు. ఆ జీవితాన్ని తన రచనలలో ప్రతిబింబించాడు.

అతని తల్లి ప్రసిద్ధ రచయిత గుస్టావ్ ఫ్లోబే [Gustave Flaubert] దగ్గిర సాహితీ శిష్యరికం చేయించింది. [అతని 'మదాం బోవరి' టాల్ స్టాయి వ్రాసిన 'అన్నా కరీనినా'కు ప్రేరకం.] ఏడేళ్లపాటు ఆ వజ్రానికి ఆయన సానపెట్టాడు. రచనలను తూర్పారపట్టాడు. "అతను నా శిష్యుడు, అతన్ని నా కొడుకులా ప్రేమిస్తాను" అన్నాడు ఆ గురువు. అతను, మొపాసాకు తుర్గనేవ్, ఎమిల్ జోల, హేన్రి జేమ్స్ లాంటి రచయితలను పరిచయం చేసాడు. అతను పెంపుడు తండ్రయ్యాడు. మొపాసా కథ 'కొవ్వు బంతి' [A Ball of Fat] 1880లో వ్రాసిన రెండు నెలలకు ఫ్లాబే చనిపోయాడు. "సతతం ఫ్లాభే గురించే ఆలోచిస్తుంటాను; అందరూ ఎలా అతన్ని గౌరవిస్తారో అలా నన్నుగౌరవించడం జరిగిన మరుక్షణం నేనూ మరణించడానికి ఇష్టపడతాను అని నాకు నేను చెప్పుకుంటుంటాను,' అన్నాడు మొపాసా.

ఉద్యోగం చేస్తున్నపుడు దొరికే ఖాళీ సమయాలలో పందెపు పడవలో [yacht] తిరగడం, స్త్రీల వేటలో గడిపడం చేసేవాడు. మొపాసా స్త్రీలోలత్వాన్నిఫ్లాబే అతన్ని మందలించాడు. గురువుకూ స్త్రీలతో లైంగిక సంబంధాలుండేవి.

మారు పేరుతో వార్తా పత్రికలకు వ్యాసాలూ వ్రాసాడు.

1880లో రచయితగా జీవితం ఆరంభమయింది. అదే సంవత్సరంలో ఫ్రాన్స్– ప్రష్యన్ యుద్ధం మీద మరో నలుగురితో కలిసి కథా సంకలనం ఒచ్చింది. అతను వ్రాసిన బౌల్ డే సుయిఫ్ [కొవ్వు బంతి – ఏ బాల్ అఫ్ ఫాట్] తో ప్రసిద్ధుడయ్యాడు. ౩౦౦ కథలు, ఆరు నవలలు, మూడు ట్రావెల్ పుస్తకాలు ఒక కవితల సంపుటి ప్రచురించబడ్డాయి.

'స్వేచ్ఛ ఒచ్చిన ఆంబోతులా' అనేక వ్యక్తులతో లైంగిక సంబంధాలను ఏర్పరచుకున్నాడు, చనిపోయేంత వరకూ. ఆడవాళ్లు అధిక సంఖ్యలో అతని చుట్టూ తిరిగేవాళ్లు. "వీళ్ళు నన్ను ఊపిరి కూడా పీల్చుకోనివ్వడం లేదు," అని తన సేవకుడితో అన్నాడు ఒకసారి. అతని తల్లి అనిన దాని ప్రకారం అతని 16వ ఏట నుంచే అతని శృంగార జీవితం ఆరంభమయింది. ఇరవయ్యో ఏట అతనికి సవాయి జబ్బు [సిఫిలిస్] వచ్చింది. దానికి తొలుత చికిత్స చేయించుకో నిరాకరించాడు. అది అతనికి, అతని తమ్ముడికీ పుట్టుకలో వచ్చిందన్న అభిప్రాయం కొందరు విమర్శకులలో ఉంది. అది క్రమేపీ మానసిక వ్యాధిగా రూపు దిద్దుకుంది. తన మానసిక వ్యాధి దిగజారడం మొపాసా గ్రహించాడు. ఆ స్థితి ప్రభావంతో కథలు వ్రాసాడు. భయానక కథలు 39 దాకా వున్నాయి. ఒక సైన్స్ ఫిక్షన్ కథ 'అంగారక మానవులు' [Martian Mankind] 1887 లో ప్రచురించబడింది. అతని మొదటి నవల [Pierre et Jean] జనవరి 1888లో వెలువడింది.

1887వ సంవత్సరంలో 1000 అడుగులపై ఎత్తు ఐఫిల్ టవర్ [Eiffel Tower] నిర్మాణాన్ని చేపట్టినప్పుడు అతనితో కలిపి 47 మంది కవులు, రచయితలు, కళాకారులూ దాన్ని నిరసించారు. దేశంలోనే ఎత్తైన కట్టడాన్ని నిర్మించడమే దాని వెనుక ఉద్దేశం. అది 1930 వరకే మిగతా కట్టడాలకన్నా ఎత్తైనదిగా ఉంది. అది కనిపించకుండా ఉండాలని దాని క్రింద ఉండే హోటల్లో భోంచేసి వాడు మొపాసా.

1887లో అతినికంటె ఐదారేళ్ళ చిన్నవాడైన అతని సోదరుడు హార్వే సవాయి రోగం కారణంగా వచ్చిన ఉన్మాదంతో మరణించడంతో మొపాసా రచనలు చేయడం మానేసాడు. "వాడు చనిపోవడం చూశాను. వైద్యులన్న దాన్నిబట్టి వాడు నిన్ననే చనిపోవలసింది కానీ, నన్ను తిరిగి చూడటం గురించీ ఎదురు చూస్తూ బ్రతికాడు ఈ రోజు వరకు,' అన్నాడు మొపాసా దుఃఖభరితంగా.'

1891లో దిగజారిన తన మానసిక స్థితి లో తన దయ్యాన్నితానే చూసినట్టు ఊహించుకున్నాడు. ఊహాజనితమైన శత్రువును చూసి తనవైపుకు తానే ఎక్కుపెట్టిన తుపాకీని పేల్చాడు. కంటి చూపు బాగా తగ్గిపోయింది. విపరీతమైన తలనొప్పులు, నిద్రలేమిదనం బాధించేవి. వాటికి మాదక ద్రవ్యాలను ఉపయోగించాడు. జనవరి 2,1893న తన పీక కోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసాడు. ఏదో శబ్దమైతే నౌకరు ఆ గదిలోకి పరిగెత్తుకుని వెళ్ళాడు. యజమాని గొంతు నుంచీ రక్తస్రావం అవుతోంది, "చూడు, ఫ్రాంస్వే, ఏమి చేశానో. నా గొంతు కోసుకున్నాను. ఇది తిరుగులేని పిచ్చి పని," అని తన వాలేతో [valet] అన్నాడు. ఆ సేవకుడే ఆసుపత్రిలో చేర్పించాడు. జూలై నెల 6వ తారీఖున 1893లో మొపాసా మరణించాడు. తన చరమశ్లోకం [epitaph] తానే వ్రాసుకున్నాడు: "ప్రతిదానిని అపేక్షించాను; ఏదీ ఆనందం ఇవ్వలేదు."

"నేను రచనలు చేయడాని ద్వేషిస్తున్నా; డబ్బ్బా దాని వలన నేను వేగపు పడవలో [yacht] తిరగగలగడం అన్న ఆలోచన నన్నుకొరడాతో కొట్టినట్టు ఈ పని చేయిస్తోంది," అన్నాడు.

ఈ రచయితా కథలు వైవిధ్యభరితం. ఈ చిత్రకారుడి కితనార [కాన్వాస్] అవధులు లేనిది; కుంచె మంత్రదండం. ఎదో ఒక మూసకో, వాదానికో పరిమితం అవడానికి నిరాకరించాడు. ఆయన కథలు మనలను వినోదింపచేయడమే కాక, మన హృదయాలను తాకుతాయి. సంఘటనలలో గుప్తత, చెప్పేదాంట్లో క్లుప్తత ఉంటాయి. అనవసర పదాలు వాడి కాలక్షేపం చేయడు. ఒక్కొక కథను ఒక్కొక విధంగా చెబుతాడు. అవి మడుగులోని మొసలిలా చదవడం ఆరంభించిన వాళ్ళను లోపలికి లాక్కుపోతాయి. కొన్ని కథలు మనలో బీభత్సాన్నిసృష్టిస్తాయి, మనలను కృంగదీస్తాయి, మనమంటే మనకు జాలి పుట్టిస్తాయి. అతని ఆవేదన మనదీ అవుతుంది. అతనికి స్త్రీ ద్వేషం ఉంది అంటారు కానీ సమాజపు ఉన్నత స్థాయి స్త్రీలంటే వాళ్ళ ప్రవర్తన సరిగ్గా లేదని చిన్న చూపు వుంది. స్త్రీల గొప్పతనాన్ని వెలికి తీసే కథలూ వున్నాయి అనేకం. నేచరలిజం 'naturalisism' నుంచి బైటపడిన తరువాత రియలిజంకు [realism] అంకితమయ్యాడు. చిత్రీకరణలో బూతును కూడా బూతుగా చూ పించడానికి వెరవ లేదు. అతని మిత్రుడు, సాటి రచయిత హెన్రీ జేమ్స్ అతను నైతిక పథంలో సింహం లాంటి వాడు అన్నాడు [నైతిక వాదులకు సింహస్వప్నం అనవచ్చేమో]. మానవ జీవితంలో ఏ అంశాన్నీ ఒదలకుండా దశాబ్దం కంటే తక్కువ కాలంలో వ్రాసిన మరొక రచయిత లేడు. మానవతా వాదాన్నిమరువనివాడు. ప్రేమించే గుణం వున్నవాడు. అతని గురువును, తల్లిని, తమ్ముడిని, చివరకు అతని సేవకుడిని ప్రాణప్రదంగా ప్రేమించిన వాడు. వ్యభిచార గాథలే కాక నిజమైన ప్రేమ గురించీ కథలు వ్రాసాడు. వ్యభిచారంలోనూ ప్రేమకు స్థానం ఉందని తెలియజేశాడు. అతనిది అనితర సాధ్యమైన శైలి. సోమర్సెట్ మామ్, ఓ హేన్రి, చెఖోవ్, హేన్రి జేమ్స్ లాంటి వారూ అతని ప్రభావానికి లోనయ్యారు. 'హారం' [Necklace] అన్న కథను కనీసం ముగ్గురు ఇతర ప్రసిద్ధ రచయితలు అనుకరించారు. అతని భయానక [హారర్], మానవాతీతమైన [super-natural] కథల వెనుక ఎడ్గార్ ఎలెన్ పో రచనల ప్రభావం ఉంది. ఆయన రచనలు వంద భాషల్లోకి అనువదించబడినాయి. అందరికన్నాఎక్కువగా చదవబడిన రచయిత. ఆయనకన్నాఎక్కువ ప్రసిద్ధుడైన రచయితే మరొకరున్నారంటే చార్ల్స్ డికెన్స్ మాత్రమే. తుర్గనీవు ఇతని కథలు టాల్ స్టాయికి ఇచ్చి చదవమన్నాడు. ఆ సంకలనం ఆయనకు అంతగా నచ్చలేదు. ఆయన రచనకు ఉండవలసిన మూడు లక్షణాలను చెప్పాడు. ఒకటి, రచయతి ఆ రచనలోని నైతికత లేక అనైతికతకు ఎటు పక్కనున్నాడో అందులో తెలియాలి; రెండు, స్పష్టత; మూడు, వ్రాసిన దానిపట్ల దాచని ఇష్టం లేక అనిష్టం. చివరి రెండు లక్షణాలూ మొపాసా కథలలో కలవు కానీ నైతికత లేదు అని అతను మొదట భావించాడు. కర్షకుల పట్ల అతనికి సానుభూతి లేదు అన్నది అతని మరో అభిప్రాయం. తండ్రి లేని బిడ్డకు తండ్రి అయిన ''సైమన్ తండ్రి [Simon's Papa] కథ మాత్రం ఆ సంపుటిలోది నచ్చింది. ఏ నాడో విడిపోయి ఒక వేశ్యా గృహంలో కలుసుకున్న అన్నా చెల్లెళ్ళ కథ 'ద పోర్ట్' [The Port] మొదలైన

మొపాసా కథలను టోల్ స్టాయ్ రష్యన్ లోకి తర్జుమా చేసాడు. 'ఒక స్త్రీ జీవితం' [une vie] అతనికి బాగా నచ్చింది. విక్టర్ హ్యూగో వ్రాసిన మహార్ణవల 'లే మిజరాబల్' [les miserables] తరువాత అది అంత గొప్ప నవల అన్నాడు. మొపాసా గొప్ప మేధోసామర్థ్యం గలవాడు [genius] కానీ నైతికతను ఎరుగడు అన్నాడు. విలియం సారోయన్ [William Saroyan] మొపాసా గురించి ఏకంగా ఒక కథ వ్రాసాడు. నోబెల్ బహుమాన గ్రహీత, గొప్ప జర్మన్ రచయిత, థామ మాన్ [Thomas Mann] మొపాసా గొప్ప కథానికా రచయితలలో ఒకడు అని ప్రశంసించాడు.

మొదట్లో 'naturalist' గ్రూపుకు చెందినవాడు. పుట్టుకతో వచ్చే లక్షణాలు, మనస్తత్వం, పరిస్థితుల ప్రభావం మనిషి ప్రవర్తనను ఎలా నిర్ణయిస్తాయో తెలియజేసే సిద్ధాంతం అది. ఆ వాదానికి ఎమిల్ జోలా ఆద్యుడు [ఒకే కుటుంబ చరిత్ర మీద మనస్తత్వ పరిశీలనతో 20 నవలలు వ్రాశాడు]. వాళ్లలో మరో నలుగురి రచనలతో ఒక కథా సంకలనం వచ్చింది. దాంట్లో మొపాసా తన పేరుతో వ్రాసిన అతని తొలి కథ 'కొవ్వు బంతి' [A Ball of Fat] ప్రచురించబడి సంచలనం సృష్టించింది. మిగతా నలుగురి కథల గురించీ ఎవరూ పట్టించుకో లేదు. ఆ కథ ఫ్రాన్స్ జర్మన్-యుద్ధ నేపథ్యంగా ఒక వేశ్య గొప్పతనం, బూర్జువా వర్గ [ఎగువ మధ్య తరగతి] ప్రయాణీకుల ద్వంద వైఖరి, నైచ్యం, వాళ్లు ఆమె పట్ల ప్రవర్తించిన తీరు చిత్రించబడినాయి. ఆ ఒక్క కథతోనే ఫ్రాన్సులో అతను వినుతికెక్కాడు.

మొపాసాకు 14 ఏళ్ల వయసున్నపుడు స్విన్బర్న్ చూపిన నిలువ ఉంచబడిన తెగిన చెయ్యి ప్రభావంతో తొలుత 'ఆ చెయ్యి' [The Hand] అన్న కథను 1876 లో; మారుపేరుతో ప్రచురించాడు. దాన్ని తిరిగి వ్రాసాడు తరువాత. ఒక ఆంగ్లేయుడు 'నేను మనుషులను కూడా వేటాడతా' అంటాడు. అతని ఇంటి గోడకు కొట్టి, ఒక బలమైన ఇనుప గొలుసుతో కట్టివేసి ఒక తెగిన హస్తం ఉంటుంది. అది అతని శత్రువుది. ఏ సందర్భంలో అది తెగ కొట్టబడిందో తెలియదు. ఆ హస్తం గల వ్యక్తి, ఆంగ్లేయుడు ఒకరిని ఒకరు నిర్మూలించే ప్రయత్నాలు చేస్తుంటారు. చివరకు ఆ అదృశ్య వ్యక్తి గెలుస్తాడు. ఆ హస్తం ఒక వేలు చంపబడిన ఆంగ్లేయుడి పళ్ళ మధ్య మిగిలి పోతుంది.

'హొర్లా' [The Horla] మానవాతీత, హారర్ కథ. దినచర్య రూపంలో వ్రాయబడింది. కథలోని కథకుడు ఒక రోజు వెళ్ళిపోతున్న నౌకకు సముద్ర తీరం నుంచీ శాల్యూట్ చేస్తాడు. దాంట్లో నుంచి ఒక అదృశ్య శక్తి ఇతని ఇంటికి ఒచ్చి తిష్ట వేస్తుంది. నీళ్ళూ పాలూ మాత్రమే తాగి జీవిస్తుందది. మనుషుల మనసులను వేధిస్తుంది. ఎప్పుడూ అతని మీద నిఘా వేసి అతనికి శాంతి లేకుండా చేస్తుంది నిద్రకూడా పోనీయకుండా. తన ఇల్లు తగులబెట్టుకుంటాడు అలాగైనా ఆ భూతం కాలిపోతుంది అన్న ఆశతో. ఆ అశరీర శక్తి చస్తుందా? చచ్చి ఉండకపోతే తనను తాను చంపుకోడం ఒకటే మిగిలింది అనుకుంటాడు. ఇదే రచయిత వ్రాసిన 'అతను' [హి} కూడా చాలా మేరకు పై కథను పోలి ఉంటుంది.

మొపాసా వ్రాసిన మూడు కథలు ఎక్కువగా పేర్కొనబడ్డాయి. అవి ది హొర్ల, ది బాల్ అఫ్ ఫాట్, నెక్ల్స్. ఈ చివరి కథలో సామాన్య కుటుంబములో పుట్టిన ఒక గుమస్తా భార్యకు రాజ వంశంలో పుట్టినంత అతిశయం. ఆమెను

సంతోషపెట్ట డానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటాడు. వాటిలో భాగంగా విద్యా మంత్రిత్వశాఖ ఇస్తున్న పెద్ద వాళ్ళ విందుకు ఒక ఆహ్వానాన్ని సంపాయిస్తాడు ఆ గుమస్తా. కానీ తనకు నగలు లేవని రానని మొరాయిస్తుంది ముందు. తరువాత ఒక ధనవంతురాలైన స్నేహితురాలిని అడిగి వజ్రాల హారం బదులు తెచ్చుకుంటుంది ఆ రోజుకు. దాన్ని పారేసుకుంటుంది. ఆ విషయం అనేక విధాల దాచి పెట్టి, కొన్ని సంవత్సరాలు స్నేహితురాలి దగ్గిరికి వెళ్లకుండా, ఆరవ చాకిరి చేసి పోయిన నగలాంటిది తయారుచేయించి స్నేహితురాలికి ఇవ్వబోతుంది. ఆమె తాను ఇచ్చింది నకిలీ నగ అంటుంది. గుమస్తా భార్య కుదేలవుతోంది తాను పడిన శ్రమ, యాతనను గుర్తుకు తెచ్చుకుని.

అంత మంచి కథ మరొకటుంది అది 'నకిలీ నగలు ' [False Gems]. ఒక సామాన్య ఉద్యోగస్తుడి భార్య చనిపోతుంది. తరువాత అతనికి రాబడి ఉండదు. ఒక వైపు అతను అమితంగా ప్రేమించిన వ్యక్తిని కోల్పోవడం మరో వైపు ఉద్యోగం పోవడం వలన ఆకలి సమస్యా. ఇంట్లో వెదికితే నాభార్య వదిలి వెళ్లిన నగలు దొరుకుతాయి. అవి నకిలీవి అని భావించినా అమ్మ జూపుతాడు. అవి అతి విలువయినవని తేలుతుంది. బతికున్నప్పుడు భార్య సంపాయించినవి అవి. అవి ఆమెకు ఊరికే ఒచ్చి ఉండవు కదా. అతనికి భార్య నడవడి వలన మనసు చివుక్కుమన్నా ఆ సంపద ఆనందాన్నితుంది. మళ్ళీ పెళ్లాడాడు; మొదటి భార్యలా కాక రెండవ ఆమె గయ్యాళి. కానీ శీలం కలది. అతని జీవితంలో మాత్రం సంతోషం లేకుండా పోయింది.

మొపాసా వ్రాసిన నవలలలో రెండు ఉత్తమమయినవి. అన్నదమ్ములు పీపీయే, జీన్ [Pierre et Jean] మనస్తత్వ పరిశీలనా నవల. వివాహేతర సంబంధంలో ఒక సంతానాన్ని కనిన విషయానికి సంబంధించింది. రెండవది, 'ఒక స్త్రీ జీవితం' [une vie]. రెండో నవలని టోల్ స్టాయ్ పొగిడింది, మొపాసా పట్ల సదాభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

మొపాసా వ్రాయని జీవితాంశం లేదు: ఒంటరితనం, ముసలితనం, చావు, వేదన, పగ, దుర్మార్గం, నోస్టాల్జియా, ప్రేమ, వంచన, యుద్ధం, భయానకం, మానవాతీతం ...నలభై మూడేళ్లు పూర్తవకుండా నిష్క్రమించిన మొపాసా మరింత కాలం జీవించి ఉంటె ప్రపంచానికి మరింత సాహిత్య సంపద లభించి ఉండేది. చిరస్మరణీయుడు.

COMMENTS